సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



కాలుష్య కోరల్లో 'వీర్లపల్లి'

ఓసీపీ.. సీహెచ్‌పీ దుమ్ము మరో వైపు.. ఆర్ ఎఫ్‌సీఎల్ ప్లాంట్ నుంచి వెలువడే వాయువు లు ఇంకో వైపు.. వీర్లపల్లి వాసులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. 8లో▸



మామిడికి 'మంగు' రోగం

ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా మామిడి రైతు లకు కష్టాలు తప్పేలా లేవు. గతంలో కంటే పూత ముందుగానే వచ్చినా నిలవడం లేదు. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0/17.0

వాతావరణం

ఉదయం మంచుకురుస్తుంది. మధ్యాహ్నం ఉక్కపోతకు అవకాశం ఉంది. ఎండవేడి మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సులువైన పద్ధతిలో ప్రయోగాలు



విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్న జిల్లా సైన్స్ అధికారి

ఎలిగేడు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సులువైన పద్ధతిలో ప్రయోగాలు చేసేలా సూచనలు, సలహాలు అందిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు అన్నారు. మండలకేంద్రంతోపాటు సుల్తాన్‌పూర్ ఉన్నత పాఠశాలల్లో సంచార ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్య అందించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అభిరుచి, పరిశీలనాత్మక శక్తి పెంపొందించాలనే లక్ష్యంతో సంచార వి/జ్ఞాన, గణిత ప్రయోగశాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 101 పాఠశాలల్లో దీనిని పూర్తి చేసినట్లు వివరించారు. పాఠశాలల హెచ్‌ఎంలు జీవన్‌రెడ్డి, సుదర్శనం, రిసోర్స్ పర్సన్లు కృష్ణమూర్తి, రాములు అనిత, వేణుగోపాల్‌రెడ్డి, జగన్, వంశీకృష్ణ, సంజీవ్, లక్ష్మణ్, సీఆర్పీ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ధ్యేయంగా పనిచేయాలి

ఎలిగేడు: గ్రామాల పరిశుభ్రతకు పాటుపడి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని అడిషనల్ డీఆర్డీవో సత్యనారాయణ, ఎంపీపీ తానిపర్తి స్రవంతి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛ భారత్ ఫేజ్–2పై సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులకు అవగాహన కల్పించారు. మండలాన్ని ఇప్పటికే ఓడీఎఫ్‌గా ప్రకటించుకున్నందున బహిరంగ మల విసర్జన లేకుండా చూడాలని, మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంకుడుగుంతల నిర్మాణాలు, ఉపయోగాలు, రోడ్లపై, ఇళ్లల్లో ఎక్కడా మురుగునీటి గుంతలు ఉండరాదని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో తగ్గించేలా చర్యలు చేపట్టాలని వివరించారు. ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఉమాపతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకళ, టీసెర్ప్ ఏపీఎం సుధాకర్, ఏపీవో సదానందం, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'అభయహస్తం' అమలు చేయాలి

పెద్దపల్లిరూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి పాలనలో మహిళలకు అందించిన అభయహస్తం పథకాన్ని పునరుద్ధరించాలని, పావలావడ్డీకే రుణాలు అందించాలని ప్రగతిశీల మహిళాసంఘ నాయకురాలు నస్పూరి లక్ష్మీ కోరారు. ఇతర నాయకులతో కలిసి సోమవారం కలెక్టర్ సంగీతకు వినతిపత్రం అందించారు. రూ.10లక్షల వరకు వడ్డీలేని రుణాలను ఇస్తామని పేర్కొన్న రాష్ట్రప్రభుత్వం.. అధికారంలోకి రాగానే మొండిచేయి చూపిందన్నారు. అభయహస్తం కింద 20,76,403 మంది మహిళలు వాటాగా జమ చేసిన సొమ్ము దాదాపు రూ.600కోట్లు ప్రభుత్వ ఖజానాలోనే ఉన్నప్పటికీ పథకాన్ని అమలు చేయకుండా దగా చేస్తోందని ఆరోపించారు. రాధ, స్వరూప, లక్ష్మి, కల్పన, సుగుణ, నీరజ, కనకలక్ష్మి తదితరులున్నారు.

ఈఎస్‌ఐ భవనం కూల్చివేత



రామగుండం: అబాది రామగుండం రహదారిలోని ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈఎస్‌ఐ డిస్పెన్సరీ భవనం కాలం చెల్లిన జాబితాలో చేరడంతో సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు రెండు రోజులుగా కూల్చేస్తున్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రామగుండంకు వంద పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రి మంజూరు చేయగా స్థల ఎంపిక కోసం ఈఎస్‌ఐ డైరెక్టర్ల బృందం నేరుగా పర్యటిస్తూ పలు ప్రాంతాల్లో పరిశీలన చేసినప్పటికీ అనువైన స్థలం నిర్ధారణ కాలేదని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం రామగుండంలో ఉన్న డిస్పెన్సరీ భవనాన్ని కూల్చివేసి బహుళ అంతస్తులతో వంద పడకల ఆస్పత్రి నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈఎస్‌ఐకి చెందిన స్థలానికి హద్దులు నిర్ణయించిన అధికారులు పురాతన భవనాన్ని కూల్చుతుండడం, నిత్యం సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తుండడం ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణం చేపడతారనే విషయమై సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరగా ఎలాంటి సమాధానమూ ఇవ్వడం లేదు.

సిఫార్సులతోనే సరి..!

- దూరపు చూపు కళ్లద్దాలు కరువు
- జిల్లాలో 13,908 మంది ఎదురుచూపులు
- కంటివెలుగు కార్యక్రమం తీరు..

రెండో విడత కంటి వెలుగు ఇలా..

మొత్తం బృందాలు	34
అర్బన్ ఏరియాలో	23
రూరల్ ఏరియాలో	11
పరీక్షలు చేయించుకుంది	1,01,835
రీడింగ్ అద్దాలు ఇచ్చింది	16,952



కంటి వెలుగు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సాక్షి, పెద్దపల్లి: అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటివెలుగు రెండో విడత ఆదిలోనే బాలారిష్టాలకు గురవుతోంది. నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపేందుకు జనవరి 19న ప్రారంభించిన పథకం ఉద్దేశం నీరుగారుతోంది. ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో కొందరికి అక్కడే అద్దాలు అందిస్తుండగా.. మిగితా వారికి ఆర్డర్ చేసి పంపిణీ చేస్తామని అధికారులు అంటున్నారు. దీంతో కళ్లద్దాల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. పరీక్షలు చేసి పక్షం రోజులు దాటుతున్నా వాటిని సరఫరా చేయకపోవడంతో గతంలో మాదిరిగానే సిఫారసులతోనే సరిపెడుతారేమోనని ప్రజలు నిరాశకు గురవుతున్నారు.

వెలుగుచూస్తున్న సమస్యలు

మొదటి విడత 40 ఏళ్లపైబడిన వారికి దృష్టి లోపాలు బయట పడగా.. ప్రస్తుతం చేస్తున్న పరీక్షల్లో వృద్ధులతో సమానంగా యువత కూడా కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు తేలుతోంది. మొబైల్స్, కంప్యూటర్ల వాడకం విపరీతంగా పెరిగిపోవడం.. మొబైల్ వెలుతురులో ఎక్కువ సేపు గడుపుతుండటంతో కళ్ల అలసటకు గురై కంటి సమస్యలు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 267 గ్రామాల్లో 34 బృందాలతో కంటి శిబిరాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు 1,01,835 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. చూపు సమస్య రకరకాలుగా ఉన్నవారికి అవసరమైన పరిమాణాల అద్దాల తయారీకి ఆర్డర్ ఇచ్చారు. అందులో 16,952 మందికి రీడింగ్ అద్దాలు అందించారు. అయితే 13,908 మందికి కళ్లద్దాలు పంపిణీ చేయాలని అధికారులు గుర్తించారు. పరీక్షలు చేసి నెలరోజులు సమీపిస్తున్నా.. పంపిణీలో తీవ్ర జాప్యం ఏర్పడటంతో కంటి పరీక్షలకే పథకం పరిమితమైందని వాపోతున్నారు.

మొదటి విడుత 20 వేలమందికి అందని వైనం

జిల్లాలో మొదటి విడుత కంటి వెలుగు కార్యక్రమం కింద 14 మండలాల్లో గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో నేత్రవైద్యశిబిరాలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 4,96,988 మందిని పరీక్షించారు. ఇందులో 1నుంచి 2.75 పాయింట్లలోపు దృష్టిలోపం ఉన్న వారిగా 63,986 మందిని గుర్తించి అద్దాలు పంపిణీ చేశారు. 3నుంచి అంతకుమించి పాయింట్లతో దూరపు చూపు మందగించిన వారు 73,320 మందిగా నిర్ధారించారు. వీరిలో 20వేలమందికి పైగా అద్దాలు పంపిణీ చేయలేదు.

అద్దాలు ఇవ్వలేదు



మా గ్రామంలో 15రోజుల క్రితం పరీక్ష చేయించుకున్న. మనిషిని గుర్తించలేకపోతున్నానని డాక్టర్లకు చెప్పిన. వారు పరీక్షించి దూరపు చూపు అద్దాల కింద రాసుకున్నరు. పోయినసారి సైతం కంటి వెలుగు కింద పరీక్షలు చేయించుకున్న. అద్దాలు అప్పుడు ఇవ్వలే.. ఇప్పుడు ఇవ్వలే..

– తుడి నర్సమ్మ, కొలనూర్

25 రోజులైంది



మా గ్రామంలో ఇటీవల నిర్వహించిన కంటివెలుగు శిబిరానికి పోయిన. 25రోజుల క్రితం పరీక్షలు చేయించుకున్న. పరీక్షించిన వైద్యులు కావాల్సిన పాయింట్ రీడింగ్ అద్దాల కోసం ఆర్డర్ చేశాం. వారం రోజుల్లో వస్తాయి.. ఇస్తామని చెప్పారు. పరీక్ష చేసుకుని నెల దగ్గరికి వస్తున్నా పంపిణీ చేయలేదు.

– కట్కూరి సత్యనారాయణరెడ్డి, కాల్వశ్రీరాంపూర్

రాగానే పంపిణీ చేస్తాం

దగ్గరి చూపు వారికి పరీక్షలు నిర్వహించి అద్దాలు వెంటనే ఇస్తున్నాం. దూరపు చూపు వారి అద్దాల కోసం ఆర్డర్ చేశాం. ప్రభుత్వం నుంచి రాగానే వారికి పంపిణీ చేస్తాం. ప్రతి గ్లాస్‌పై బార్‌కోడ్ ఉంటుంది. దాన్ని స్కాన్ చేస్తే లబ్ధిదారులు ఎవరనేది తెలుస్తుంది. దీనిపై ప్రజలు ఆందోళన చెందవద్దు.

– ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో

సింగరేణి నిధులు ప్రభావిత గ్రామాల్లోనే వెచ్చించాలి

- మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు



మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న శ్రీధర్‌బాబు

రామగిరి(మంథని): సింగరేణి యాజమాన్యం కేటాయిస్తున్న నిధులను ప్రభావిత గ్రామాలకే వెచ్చించాలని ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. మండలంలోని పన్నూరులో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. సింగరేణి నిధులను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని, అభివృద్ధి, సదుపాయాలు కల్పిస్తే స్థానిక ప్రజలకు ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. యువతకు స్వయం ఉపాధి అవకాశం కల్పించేందుకు దృష్టి సారించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తనకు ప్రభుత్వం కేటాయిస్తున్న ప్రతిపైసా ఇక్కడే ఖర్చు చేస్తున్నానని, ఇప్పటివరకు మన ఊరు మన బడి కార్యక్రమానికే వెచ్చించానని వెల్లడించారు. సర్పంచ్ అల్లం పద్మ, ఎంపీటీసీలు చిందం మహేశ్, కొప్పుల గణపతి, కొట్టె సందీప్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు తోట చంద్రయ్య, దొడ్ల బాలాజీ, దాసరి శివ, వనం రాంచందర్‌రావు, ముస్త్యాల శ్రీనివాస్, బండారి సదానందం తదితరులు ఉన్నారు.

పరిశ్రమల నుంచి కాలుష్యాన్ని నియంత్రించాలి

- యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలి
- సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం అగ్రస్థానం
- రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి కొప్పుల, ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ఈప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, నివారణకు యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. రామగుండం ప్రాంతంలో కాలుష్యం ఎక్కువగా ఉందని, ఇందుకు పరిశ్రమలు విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. పర్యావరణంపై సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ వంటి సంస్థలు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్నారని, ఇందులో భాగంగానే పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించి పట్టణాలను అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పల్లె, పట్టణం తేడా లేకుండా బడ్జెట్ కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రజాసంక్షేమం కోరుకునే ప్రభుత్వాన్ని ప్రజలు అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే చందర్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజాసంక్షేమానికి సీఎం కేసీఆర్ అహర్నిశలు శ్రమిస్తున్నారని, రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, కల్యాణలక్ష్మి వంటి పథకాలు ఇందులో భాగమేనని వివరించారు. కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, డెప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, రాష్ట్ర నాయకురాలు మూల విజయారెడ్డి, కార్పొరేటర్లు దాతు శ్రీనివాస్, పెంట రాజేష్, జనగామ కవితా సరోజిని, ఆర్జీ–1 జీఎం కె.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ సంగీత
- 29 దరఖాస్తుల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వచ్చిన ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సంగీత అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 29 దరఖాస్తులను ఆమె స్వీకరించారు. పాలకుర్తి మండలం జీడీ నగర్ మీదుగా భారీవాహనాలు, లారీలు వెళ్లడం ద్వారా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ సూర సమ్మయ్య ఫిర్యాదు చేశారు. టోల్ గేట్ వద్ద ఫీజు తప్పించుకునేందుకే ఇలా ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తుల్లో 16 రెవెన్యూ సంబంధమైనవి కాగా.. 13 ఇతర శాఖలవి కావడం గమనార్హం. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారంలోకొస్తే రూ.రెండు లక్షలు రుణమాఫీ

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్



ముర్మూర్‌లో పర్యటిస్తున్న మక్కాన్‌సింగ్

రామగుండం: కాంగ్రెస్ అధికారంలోకొస్తే రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతామని పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఆయన అంతర్గాం మండలంలోని ముర్మూర్‌లో పర్యటించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి దశాబ్దం దాటినా నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాస ప్యాకేజీ అందించకపోవడం దురదృష్టకరమన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే.. ధరణి పోర్టల్ రద్దు చేస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని స్పష్టం చేశారు. బీసీ సెల్ మండల అధ్యక్షుడు బర్పటి శ్రీనివాస్, అప్పాల రాజేందర్, గాదె సుధాకర్, మద్దె తిరుపతి, గుంట బాపు, కోల రామ్మూర్తి, బొడ్డు లింగమూర్తి, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, ఆవుల గోపాల్‌యాదవ్ తదితరులున్నారు.

నెలాఖరులోపు సీఎమ్మార్ పూర్తి కావాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రైస్‌మిల్లర్లు ఈ నెలాఖరులోపు కస్టం మిల్లింగ్ రైస్ డెలివరీ పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. యాసంగి సీజన్‌లో తీసుకున్న ధాన్యాన్ని నిర్ణీత గడువులోగా మిల్లింగ్ చేసి అందించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా మిల్లర్లు పనిచేయాలన్నారు. లక్ష్య సాధనలో వెనకబడి ఉన్న మిల్లర్లు.. అవసరమైన ఏర్పాట్లు చేసుకుని సకాలంలో చేరుకోవాలని సూచించారు. మిల్లులు పూర్తి సామర్థ్యం మేర నిర్వహించాలని, యంత్రాలు బ్రేక్‌డౌన్ అయితే మరమ్మతు చేయించుకోవాలని స్పష్టం చేశారు. హమాలీల కొరత లేకుండా ఎఫ్‌సీఐ అధికారులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు ప్రభాకర్, లక్ష్మారెడ్డి, డీఎస్‌ఓ వెంకటేశ్, మిల్లర్లు పాల్గొన్నారు.

2025లో కరీంనగర్‌కు రైలు..!

- మరో రెండేళ్లలో కొత్తపల్లి-మనోహరాబాద్ మార్గం పూర్తి
- ఈ ఏడాది దుద్దెడ, సిద్దిపేటకు, 2024లో సిరిసిల్లకు రైలు
- కొండగట్టు మాస్టర్‌ప్లాన్‌తో ఈ మార్గానికి పెరిగిన డిమాండ్
- ఒకేమార్గంలో కొమురవెల్లి, కొండగట్టు, వేములవాడ, కాళేశ్వరం పుణ్యక్షేత్రాలు
- హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లకు ముఖద్వారంగా కరీంనగర్



కరీంనగర్ రైల్వేస్టేషన్



కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వే ప్రాజెక్టు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే ప్రాజెక్టు తుదిదశకు వచ్చింది. మరో రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే లక్ష్యాన్ని విధించుకుంది. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే చాలా వేగంగా పనులు చేపడుతోంది. 2025 మార్చి వరకు ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయనున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ప్రాజెక్టు స్వరూపం, ఖర్చు, పూర్తి చేసే తేదీ తదితరాలను ప్రకటించింది. సికింద్రాబాద్ నుంచి కరీంనగర్‌ను కలుపుతూ రూపొందించిన మనోహరాబాద్ (మేడ్చల్)- కొత్తపల్లి (కరీంనగర్) రైల్వే ప్రాజెక్టు ఇది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు అధిక ఖర్చు, వయబిలిటీ ఉండదన్న కారణాలతో పక్కన పెట్టిన ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం వినతితో 2016లో దక్షిణ మధ్య రైల్వే చేపట్టింది. ప్రస్తుతం గజ్వేల్ వరకు ట్రయల్ రన్ నడుస్తోంది. ప్రభుత్వం వేములవాడ, కొండగట్టుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించి అభివృద్ధి చేస్తుండటంతో ఈ మార్గంలో ఆధ్యాత్మిక పర్యాటకం ఊపందుకోనుంది.

ఈ ఏడాది చివరలో సిద్దిపేట, దుద్దెడకు..

ప్రాజెక్టులో భాగంగా ప్రస్తుతం మనోహరాబాద్-గజ్వేల్ మధ్య 32 కి.మీ మేర ట్రాక్ పూర్తయి ట్రయల్ రన్ నడుస్తోంది. గజ్వేల్ నుంచి కొడకండ్ల వరకు కొత్తగా నిర్మించిన 12.5 కిలోమీటర్ల మార్గం కూడా పూర్తయి ట్రయల్‌రన్‌కు సిద్ధంగా ఉంది. ఇక ఈ ఏడాది ఆగస్టులో కొడగండ్ల-దుద్దెడను ఆగస్టులో, దుద్దెడ-సిద్దిపేటను డిసెంబరులో, సిద్దిపేట సిరిసిల్ల వచ్చే ఏడాది మార్చిలో, సిరిసిల్ల- కొత్తపల్లి 2025 మార్చిలో పూర్తి చేయనున్నారు. ఇప్పటివరకు పనులన్నీ అనుకున్న విధంగా గడువులోనే జరుగుతుండటం గమనార్హం.

మాస్టర్ ప్లాన్లతో పెరిగిన డిమాండ్

ఈ ప్రాజెక్టు పూర్తయితే.. రాష్ట్రంలో పలు ఆధ్యాత్మిక క్షేత్రాలు ఒకే రైల్వేలైను పరిధిలో దర్శించుకునే వీలు కలుగుతుంది. ఈ మార్గంలో కొమురవెల్లి, కొండపోచమ్మ, నాచారం లక్ష్మీ నర్సింహా స్వామి, నాంపల్లి, వేములవాడ పుణ్యక్షేత్రాలు వస్తాయి. కొత్తపల్లి స్టేషన్ అందుబాటులోకి వస్తే.. అక్కడ నుంచి కరీంనగర్ స్టేషన్ నుంచి కొండగట్టు (నూకపల్లి-మల్యాల)స్టేషన్‌కు కలపవచ్చు. ఇటీవల బడ్జెట్‌లో వేములవాడ మాస్టర్ ప్లాన్ కోసం రూ.50 కోట్లు, కొండగట్టుకు రూ.600 కోట్లు ప్రకటించడంతో ఈ రెండు పుణ్య క్షేత్రాలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఈ రెండు ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ ప్రాధాన్యం పెరిగింది. ఇదే విషయాన్ని దక్షిణమధ్య రైల్వే కూడా గుర్తించింది. అందుకే, ఈ రైల్వేలైన్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసే పట్టుదలతో ఉన్నామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ధీమాగా ఉన్నారు. ఈ ప్రాజెక్టు ఇప్పటికే 46 శాతం మేర ప్రాజెక్టు పూర్తయింది.

షిరిడీ, ముంబై, బెంగళూరులకు రైళ్లు

కొత్తపల్లి- మనోరాబాద్ రైల్వేలైన్ హైదరాబాద్ డివిజన్‌లో ఉంది. అదే ఖాజీపేట-బల్లార్షా మార్గం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోకి వస్తుంది. ఈ రెండు మార్గాలకు కొత్తపల్లి జంక్షన్‌లా మారనుంది. ఉత్తరభారతదేశానికి దక్షిణ భారతదేశానికి ఇది ముఖద్వారంగా అవతరించనుంది. ఈ మార్గం పూర్తయితే ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, సిద్దిపేట, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ వాసులకు షిరిడీ, ముంబై, షిరిడీ, బెంగళూరులకు రైళ్లు నడపొచ్చని దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు.

ప్రాజెక్టు పురోగతి..!

సంవత్సరం	మార్గాలు	లక్ష్యం	కిలోమీటర్లు
2020–21	మనోహరాబాద్–గజ్వేల్	పూర్తయింది	31.071
2021–22	గజ్వేల్–కొడకండ్ల	పూర్తయింది	12.25
2022–23	కొడకండ్ల–దుద్దెడ	ఆగస్టు 2023	21.50
2023–24	దుద్దెడ–సిద్దిపేట	డిసెంబర్ 2023	11.10
2023–24	సిద్దిపేట–సిరిసిల్ల	మార్చి 2024	37.15
2024–25	సిరిసిల్ల–కొత్తపల్లి	మార్చి 2025	39.01

మనోహరాబాద్-కొత్తపల్లి ప్రాజెక్టు వివరాలు

ప్రాజెక్టు పొడవు
151.36 కిలోమీటర్లు

మంజూరైన సంవత్సరం
2016-17

ప్రాజెక్టు ఖర్చు
రూ. 1,167 కోట్లు

ఇప్పటివరకు ఖర్చు
రూ.796.92 కోట్లు

పొడవు ప్రారంభం (కిలో మీటర్లు)
31.071 కిలోమీటర్లు

భూసేకరణ హెక్టార్లు
అవసరం :1079.816
సేకరించింది:703.116

అటవీభూమి (హెక్టార్లు)
అవసరం: 2.200
సేకరించింది: 2.200

ముఖ్యమైన బ్రిడ్జిలు	01
మేజర్ బ్రిడ్జిలు	21
చిన్న బ్రిడ్జిలు	153
సబ్‌వేలు,ఆర్‌యూబీలు	37
స్టేషన్లు	14
భౌతిక పురోగతి	46 శాతం
ప్రాజెక్టు పూర్తి	2024-25

క్లుప్తంగా

ఆదరణ ఓర్వలేకనే అక్రమ కేసులు


నియోజకవర్గ ఇన్‌చార్జి రాజమ్మ

ధర్మారం: షర్మిల చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అధికార పార్టీ బలంతో అక్రమంగా అరెస్టు చేయిస్తున్నారని వైఎస్సార్ టీపీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి మోకనపల్లి రాజమ్మ ఆరోపించారు. సోమవారం ధర్మారంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు చేస్తున్న అక్రమాలు, ప్రజాధనాన్ని దోచుకుంటున్న విధానాన్ని పాదయాత్ర సందర్భంగా ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్న షర్మిలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీకి ప్రజల చేతిలో ఓటమి తప్పదన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షురాలు స్వరూపరాణి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ ఆర్జీ3, ఏపీఏ ఏరియాలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. సీఎంపీఎఫ్ చిట్టీల పంపిణీలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ సోమవారం సెంటినరీకాలనీలోని జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మూడేళ్లుగా సీఎంపీఎఫ్ చిట్టీలు ఇవ్వకపోవడంపై కార్మికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అనంతరం ఎస్‌ఓటూ జీఎం జి.రఘుపతికి వినతి అందించారు. కార్యక్రమంలో పులిపాక రమేశ్, కాసిపేట లింగయ్య, బండారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో మేట్‌లను కొనసాగించండి


మంత్రి దయాకర్ రావుకు వినతిపత్రం ఇస్తున్న మేట్‌లు

కాల్వశ్రీరాంపూర్: ఉపాధి హామీ పథకంలో మేట్‌లను కొనసాగించాలని పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. రెండేళ్లుగా వేతనాలు లేవని, జిల్లాలో 400 మంది ఉపాధి కోల్పోయారని పేర్కొన్నారు. అర్హత ఉన్న సీనియర్ మేట్‌లకు ఫీల్డ్ అసిస్టెంట్లుగా పదోన్నతి ఇవ్వాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని, సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పాలమాకుల అశ్విత్‌కుమార్ తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర ఉపాధ్యక్షుడు దబ్బెట సంపత్ కుమార్, సల్వాల శైలజ, సహాయ కార్యదర్శి ముక్కెర లావణ్య, ప్రచార కార్యదర్శి కోటేశ్, వినోద్‌కుమార్ ఉన్నారు.

కాలుష్య కోరల్లో ‘వీర్లపల్లి’

- ఇళ్లలోకి చేరుతున్న సింగరేణి బొగ్గు దుమ్ము
- ఆరు బయటకు వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలంటున్న గ్రామస్తులు


వీర్లపల్లిలో వంటపాత్రలపై పేరుకుపోయిన దుమ్మును చూపుతున్న మహిళ

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఓసీపీ దుమ్ము ఒక వైపు.. సీహెచ్‌పీ బొగ్గు దుమ్ము మరో వైపు.. ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్ నుంచి వెలువడే వాయువులు ఇంకో వైపు.. వీర్లపల్లి వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గ్రామస్తులు వ్యాధులబారిన పడుతున్నారు. సీహెచ్‌పీ, ఓసీపీ–3, 5లలో బ్లాస్టింగ్ సమయాల్లో వెలువడే దుమ్ము ఇళ్లపై చేరుతోంది. దీంతో ఆరుబయట బట్టలు, వంటపాత్రలపై దుమ్ము పేరుకుపోతోంది. సింగరేణి విస్తరణలో సర్వస్వం కోల్పోయిన రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్‌లోని వీర్లపల్లి గ్రామస్తులను కాలుష్యం కమ్మేస్తుండడంతో గ్రామస్తులు అవస్థలుపడుతున్నారు.

దుమ్ము, యంత్రాల శబ్దం..

ఓసీపీ నుంచి వచ్చే దుమ్ము, ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్ నుంచి వెలువడే శబ్దాలు, అమోనియా వాసనతో వీర్లపల్లి గ్రామస్తులు రాత్రిపగలు నిద్రలేక ఇబ్బందులకు గురవుతున్నారు. సింగరేణి సీహెచ్‌పీ నుంచి బొగ్గు దుమ్ము గాలిలో చేరి ఊపిరాడక ఇబ్బంది పడుతున్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై సింగరేణి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తమ గ్రామాన్ని వెంటనే ఖాళీ చేయించి నష్టపరిహారం చెల్లించి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు

1988లో సింగరేణి ఓసీపీ–3, సీహెచ్‌పీ ప్లాంట్ ప్రారంభమైంది. గతంలో ఎఫ్‌సీఎఫ్ కర్మాగారం నుంచి వెలువడే దుమ్ముతో ఇబ్బంది పడేవారు. ప్లాంట్ నుంచి వెలువడే విషవాయువులు, దుర్వాసనతో చర్మ, ఊపిరితిత్తుల వ్యాధుల బారినపడ్డారు. 1999లో ప్లాంట్ మూతపడడంతో కొంత ఉపశమనం లభించినట్లైంది. 2015లో తిరిగి గ్యాస్ ఆధారిత ఆర్‌ఎఫ్‌సీఎల్ పేరుతో తిరిగి ప్రారంభించడంతో వీరి బాధలు మొదలయ్యాయి. 22 ఫిబ్రవరి 2021న ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారంలో ఉత్పత్తి ప్రారంభమైంది. అప్పటి నుంచి కర్మాగారంలో సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు అమోనియా గ్యాస్ వెలువడడంతో ప్లాంట్‌కు సమీపంలోనే ఉన్న వీర్లపల్లి గ్రామస్తులు ఊపిరాడక, కళ్ల మంటలు మండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలుష్య సమస్యలపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేసిన శాశ్వత పరిష్కారం చూపించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

దుమ్ము రాకుండా చర్యలు చేపట్టాలి



వీర్లపల్లి గ్రామానికి కూతవేటు దూరంలో సింగరేణి సీహెచ్‌పీ ప్లాంట్ ఉండడంతో దుమ్ము గ్రామంలోకి చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్లాంట్ నుంచి దుమ్ము గ్రామం వైపు రాకుండా ఉండేందుకు టార్పాలిన్, గ్రీన్ మ్యాచ్ ఏర్పాటు చేయాలి.

– సొల్లు రవి, వీర్లపలి

ఎవరూ పట్టించుకుంటలేరు



వీర్లపల్లి గ్రామం చుట్టూ సింగరేణి ఓపెన్ కాస్ట్ కుప్పలు, సీహెచ్‌పీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారం ఉండడంతో వాటి నుంచి వెలువడుతున్న కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు. అధికారులు, నాయకులు స్పందించి కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలి.

– బాదే శ్రీనివాస్, వీర్లపల్లి

పిల్లల సంరక్షణకు క్రెచ్ ఏర్పాటు చేయాలి

- సింగరేణి మహిళా ఉద్యోగుల డిమాండ్


వినతి పత్రం అందిస్తున్న ఉద్యోగులు

గోదావరిఖని: సింగరేణి మహిళా ఉద్యోగుల పిల్లల సంరక్షణకు పని ప్రదేశాల్లో క్రైచ్ ఏర్పాటు చేయాలని ఆర్జీ–1 ఏరియా వర్క్‌షాప్ డీజీఎంకు వినతి పత్రం అందించారు. సీఐటీయూ ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్యాల శ్యామల మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రాంతాల్లో పరిశ్రమల యాక్ట్ ప్రకారం పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు, వారిని చూసుకునేందుకు ఓ వ్యక్తిని నియమించాల్సి ఉందని తెలిపారు. 50మంది మహిళలు, అంతకన్నా ఎక్కువ మంది ఒకే పనిప్రదేశంలో పనిచేస్తే వారి పిల్లల సంరక్షణకు ఒక గదిని ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ చట్టంపై సింగరేణి యాజమాన్యానికి అవగాహన లేకపోవడంతోనే ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదన్నారు. జీఎం ఆఫీస్, ఏరియా వర్క్‌షాప్, ఆసుపత్రుల్లో తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి నంది నారాయణ, సీహెచ్.సాయిలత, కావ్య, లక్ష్మి, సంగీత, భవ్య, శివాంజలి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే లక్ష్యాల సాధన


జీఎంను సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: సమష్టి కృషితోనే వార్షిక లక్ష్యాలు సాధించగలిగామని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ తెలిపారు. 40రోజుల ముందుగానే వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించినందుకు నారాయణను యూనియన్ నాయకులు, జీఎం కార్యాలయం అధికారులు సోమవారం సన్మానించారు. 39.20లక్షల టన్నులకు లక్ష్యానికి గడువుకు ముందే 39.24 లక్షలు ఉత్పత్తి చేయడం అభినందనీయమని జీఎం పేర్కొన్నారు. టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, సీఎంఓఏఐ అధ్యక్షుడు పొనుగోటి శ్రీనివాస్, ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, ఏజీఎం ఫైనాన్స్ రామక్రిష్ణ, ఐఈడీ డీజీఎం ఆంజనేయులు, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, ఎస్టేట్ అధికారి బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామగుండం: సాంఘిక సంక్షేమ గురుకులం విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి ఎం.మంజుల తెలిపారు. అభ్యర్థులు మార్చి మూడో తేదీలోగా ఆన్‌లైన్‌లో రూ.వంద చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఒక సెల్‌ఫోన్ నంబర్‌తో ఒక దరఖాస్తు చేసుకునేందుకు మాత్రమే వీలుంటుంది. ఆన్‌లైన్ వెబ్‌సైట్ చిరునామా http://tswreis.ac.in లేదా tgtwgurukuam.telangana.gov.inలో దరఖాస్తులు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

- ఇతర విద్యార్థుల ఫొటోలు పెట్టి దరఖాస్తు చేసిన వారిపై సెక్షన్ 416 ఐపీసీ 1860 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటారు.
- విద్యార్థుల ఎంపికకు పాత జిల్లా యూనిట్‌గా పరిగణించబడుతుంది.
- ఇతర సమాచారానికి హెల్ప్‌లైన్ నంబర్ 1800 425 45678లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా సంప్రదించవచ్చు.
- 2022–23 విద్యా సంవత్సరంలో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. సదరు విద్యార్థులు తమ ధ్రువీకరణపత్రాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 23న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో ఎంపిక చేయబడిన కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష ఉంటుంది.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ప్రభుత్వం అనుసరిస్తున్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు పర్చాలని డిమాండ్ చేశారు. వివిధ రంగాల ఉద్యోగుల వేతనాలను 30శాతం పెంచిన ప్రభుత్వం.. పంచాయతీ కార్మికులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎరవెల్లి ముత్యంరావు, ఖాజా, శ్రీనివాస్, తిరుపతి, అశోక్, రాజయ్య, నర్సింగం, బాణయ్య, శ్రీనివాస్, లచ్చయ్య, స్వామి, సాంబయ్య, ఆనంద్, సురేశ్, నాగయ్య, నరేశ్, రాజబాబు, గట్టయ్య, గౌసోద్దిన్, శంకర్ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి బస్తీబాట



మాట్లాడుతున్న రమేశ్

గోదావరిఖని: నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి బస్తీబాట నిర్వహిస్తున్నట్లు తెలంగాణ లేబర్‌పార్టీ అధ్యక్షుడు గొర్రె రమేశ్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 50 డివిజన్లలో బస్తీబాట, మండలాల్లో పల్లెబాట కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 26న స్థానిక ప్రధాన చౌరస్తాలో బస్తీబాట ప్రారంభిస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. నాయకులు ఎ.తిరుపతి, గాజుల రమేష్, జక్కం కవిత, పి.రజిత, జీఎస్ రావు, అఖిల్‌వర్మ, ఉప్పులేటి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మామిడికి ‘మంగు’ రోగం

- పంటను కాపాడుకునేందుకు రైతుల ఆరాటం
- విచ్చలవిడిగా మందుల పిచికారీ
- అందుబాటులో లేని ఉద్యానశాఖ


కటికెనపల్లిలో మందులు పిచికారీ చేస్తున్న రైతులు


నల్లగా మారిన పిందెలు

ధర్మారం: ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా మామిడి రైతులకు కష్టాలు తప్పేలా లేవు. గతంలో కంటే పూత ముందుగానే వచ్చినా నిలవడం లేదు. పడుతున్న పిందె పడుతున్నట్లుగానే మంగు రోగం వ్యాపిస్తోంది. దీంతో రైతులు పంటను కాపాడుకునేందుకు తోచిన క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు తోటలను పరిశీలించి సూచనలు, సలహాలు ఇస్తే బావుటుందని అభిప్రాయపడుతున్నారు. జిల్లాలోనే అత్యధిక విస్తీర్ణంలో మామిడిని మండలంలోనే పండిస్తున్నారు. దశాబ్దకాలంగా మంచి దిగుబడి రావటంతో సాగు విస్తీర్ణం పెరుగుతూ వచ్చింది. ఇలా ప్రస్తుతం 8,230 ఎకరాల్లో తోటలు ఉన్నాయి. అయితే నాలుగేళ్లుగా రైతులకు ఆశించిన పంట దిగుబడి రావడం లేదు. ఈ ఏడాది నవంబర్, డిసెంబర్‌లోనే తోటలు పూతకొచ్చాయి. అదే సమయంలో వివిధ రకాల రోగాలు వ్యాపించడంతో పూత ఆశించిన మేర నిలవలేదు. జనవరి చివరి వారంలో పిందె దశకు చేరుకున్న తర్వత కూడా తెగుళ్లు వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పిందెలు మంగు బారిన పడి నల్లగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు క్రిమిసంహారక మందులను ట్రాక్టర్ స్ప్రేయర్లతో పిచికారీ చేయిస్తున్నారు. తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించాల్సిన సంబంధిత అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారని అన్నదాతలు చెబుతున్నారు. పూత సమయంలో.. పిందె, కాయ పెరిగే దశల్లో ఎలాంటి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలో.. అనే విషయాలపై కనీసం అవగాహన సదస్సులు కూడా నిర్వహించటం లేదని వాపోతున్నారు.

ఉద్యానశాఖ పట్టించుకోవటం లేదు



ఐదెకరాల్లో మామిడి సాగుచేస్తున్న. వాతావరణంలో మార్పులతో తెగుళ్లు వస్తున్నాయి. రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ఉద్యానశాఖ అధికారులు పట్టించుకోవటం లేదు. కనీసం తోటలను సందర్శించటం లేదు. మాకు తోచిన, కంపెనీవారు చెప్పిన మందులు పిచికారీ చేస్తున్నం.

– బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, నర్సింగపూర్

పూత దూసుకుపోయింది



మామిడికి పూత గతేడాది కంటే ముందుగానే వచ్చింది. తెగుళ్లతో లాభం లేకుండాపోయింది. పూత దూసుకుపోతోంది. ఎలాంటి మందులు పిచికారీ చేయాలో చెప్పేవారు లేరు. కొన్ని క్రిమి సంహారక మందుల కంపెనీవారు వచ్చి పరిశీలిస్తున్నారు. వారు ఏది చెబితే అదే మందు పిచికారీ చేస్తున్నం.

– తీగుళ్ల సతీశ్‌రెడ్డి, చామనపల్లి

మంగు రోగం వస్తంది



మామిడి పూత మొత్తం దూసుకు పోయింది. మిగిలిన పిందెలకు మంగు రోగం వస్తంది. ఏ మందులు కొట్టాలో చెప్పేవారు లేరు. ఉద్యావనశాఖ అధికారులు తోటలను సందర్శించి రైతులకు సలహాలు ఇవ్వాలి.

– గడ్డం కొమురెల్లారెడ్డి, బంజేరుపల్లి

కారు అదుపుతప్పి బోల్తా

- గాయాలతో బయటపడ్డ ఇద్దరు


పంట పొలంలో బోల్తాపడిన కారు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండల కేంద్రం శివారులో సోమవారం కారు అదుపుతప్పింది. ఈ సంఘటనలో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. చందుర్తిలో నివసిస్తున్న ఇల్లందు ప్రసాద్, అతని బంధువుతో కలిసి సోమవారం జగిత్యాల జిల్లా భీమారం మండలం మోతుకులరావుపేటకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో చందుర్తి శివారుకు చేరుకోగానే కారు అదుపుతప్పింది. గాయపడ్డ ఇద్దరిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

వేములవాడఅర్బన్: మండలంలోని ఆరెపల్లి శివారు కరీంనగర్–సిరిసిల్ల రహదారిలో సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్ నుంచి కారులో వస్తున్న వేములవాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగరాజును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. నాగరాజుకు తీవ్రగాయాలు కావడంతో 108లో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

రోడ్డుపై పడిన బియ్యం బస్తాలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై సోమవారం లారీ నుంచి పీడీఎస్ బియ్యం బస్తాలు ప్రమాదవశాత్తు కింద పడ్డాయి. లారీ వెనుక వస్తున్న వాహనాలకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో కూలీలతో బస్తాలను మళ్లీ లోడు చేసి లారీని తరలించారు.

స్టీరింగ్ ఫెయిలై ఆటో బోల్తా

- 16 మంది కూలీలకు గాయాలు
- 23 మందితో బోల్తాపడిన గూడ్స్ ఆటో
- సిరిసిల్ల ఆస్పత్రికి తరలింపు
- అందరూ చీర్లవంచ గ్రామస్తులే


ఆసుపత్రిలో ఆర్తనాదాలతో క్షతగాత్రులు


ప్రమాదస్థలంలో కూలీలు


పలుమర్ల లలిత


వేల్పుల ఓదవ్వ


బోయిన మల్లవ్వ

ఇల్లంతకుంట(మానకొండూర్)/తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఆటో స్టీరింగ్ ఫెయిల్ కావడం ఆటోబోల్తా పడిన సంఘటనలో 16 మంది కూలీలు గాయపడ్డారు. ఏడుగురు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన 22 మంది వ్యవసాయ కూలీలు ఇల్లంతకుంట మండలంలోని నర్సక్కపేటకు పత్తి తీసే పనులకు ఉదయం ట్రాలీ ఆటోలో బయలుదేరారు. ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్లకు చేరుకోగానే ఆటో స్టీరింగ్ ఫెయిల్ కావడంతో ఒక్కసారిగా రోడ్డు పక్కకు దూసుకుపోయి బోల్తాపడింది. ఎస్సై మహేందర్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో ఆటో డ్రైవర్ గంట పర్శరాములుతోపాటు 22 మంది కూలీలు ప్రయాణిస్తున్నారు. ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు, 16 మందికి స్వల్పంగా గాయపడగా.. ఏడుగురు క్షేమంగా బయటపడ్డారు. ఆటో బోల్తా పడిన ఘటనలో చీర్లవంచకు చెందిన వేల్పుల ఓదవ్వ పరిస్థితి విషమంగా ఉండగా.. ఐసీయూలో చికిత్స పొందుతోంది. పలుమరి లలితకు కుడి చెయ్యి విరిగింది. బోయిని మల్లవ్వ పక్కటెముకలకు గాయాలయ్యాయి. నర్మెట అంజవ్వ, పుష్పవ్వ, జెరిపోతుల కనకవ్వ, దుర్గవ్వ, మానువాడ దేవవ్వ, రేణుక, ముస్కానిపేట లచ్చవ్వ, కదారి బీరయ్య, పలుమరి లావణ్య, మల్లవ్వ, పద్మ, బోయిని మల్లయ్య, గంగ దేవేంద్రలకు స్వల్ప గాయాలయ్యాయి.

క్షతగాత్రులకు పరామర్శలు

క్షతగాత్రులను సిరిసిల్ల ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా తంగళ్లపల్లి జెడ్పీటీసీ పూర్మాని మంజుల–లింగారెడ్డి దంపతులు పరామర్శించారు. తక్షణ సాయంగా కొంత నగదు, భోజనం ఏర్పాటు చేశారు. ఎంపీపీ పడిగెల మానస, చీర్లవంచ సర్పంచ్ జక్కుల రవీందర్, నాయకులు జక్కుల నాగరాజు, జాలగం ప్రవీణ్(టోని) పరామర్శించారు.